క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి


అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

మనుబోలు : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పొదలకూరు సీఐ రాంబాబు నిర్వాహకులకు సూచించారు. మనుబోలు మండల కేంద్రంలోని పలు కూడళ్లలో నెలకొల్పిన గణనాథుల మండపాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. అనుమతులు తీసుకున్నారా? అని పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై ఎంఎస్ రాకేష్, ఏఎస్సై తిరుపాల్, కానిస్టేబుళ్లు మాధవరావు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

• రూ.1.20 లక్షల నష్టం


దగ్ధమవుతున్న గడ్డివామి

మనుబోలు : మండల పరిధిలోని పిడూరు మిక్స్‌డ్ కాలనీలో ప్రమాదవశాత్తు ఆదివారం ఓ గడ్డివామి దగ్ధమైంది. కాలనీకి చెందిన వలిపి మునిస్వామి పశువులు మేపుకుంటూ పాల విక్రయం ద్వారా జీవనం సాగిస్తారు. పశువుల మేత కోసం రూ.1.20 లక్షలు వెచ్చించి 20 ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి ఇంటి పరసరాల్లో గడ్డివామి వేసుకున్నారు. ఏమి జరిగిందో ఆదివారం హఠాత్తుగా గడ్డివామిలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న గూడూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమవడంతో రైతు పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని మునిస్వామి కోరుతున్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, అయితా భాస్కర్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలను అందజేయండి

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను సోమవారం స్వీకరించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అర్జీలను ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు స్వీకరించనున్నామని చెప్పారు.

శశిరబాబు మృతికి సంతాపం

నెల్లూరు(అర్బన్): తుమ్మలపెంట పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజవరపు శశిరబాబు హఠాన్మరణం చెందడంపై ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. హంస కావలి తాలూకా అధ్యక్షుడు సోమేశ్వరరావు, సెక్రటరీ లక్ష్మీనరసయ్య, నేతలు స్టీఫెన్‌కుమార్, శ్రీధర్ తదితరులు నివాళులర్పించారు.

15న అండర్ - 14 క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా అండర్ - 14 క్రికెట్ జట్లను ఈ నెల 15న ఎంపిక చేయనున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ సొంత క్రికెట్ కిట్, డ్రెస్ కోడ్, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో తిరుప్పావై సేవ, అభిషేకాలు తదితరాలను ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జై గణేశా.. జై జై గణేశా


పొదలకూరు : రామమందిరం వద్ద..

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో వినాయక చవితి పండగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊరూ వాడా ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి భారీ గణనాథుని విగ్రహాలను కొలువుదీర్చారు. ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నదాన కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. పలుచోట్ల జరిగిన ఉట్టి మహోత్సవంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

• ఘనంగా చవితి వేడుకలు

పొదలకూరు : మండల కేంద్రమైన పొదలకూరులో వాడవాడలా వినాయకుని ప్రతిమలు వెలిశాయి. యువకులు అత్యంత ఉత్సాహంగా చవితి వేడుకలను జరుకున్నారు. గ్రామాల్లో సైతం పోటాపోటీగా వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో


కొడవలూరు : గండవరంలో..


ఇందుకూరుపేట : మైపాడులో..


పొదలకూరు : గేటుసెంటర్‌లో హంసవాహనంపై విఘ్నేశ్వరుడు

రామమందిరం, తొగటవీధి, పద్మావతినగర్, వినాయకమాన్యం, పుట్టాయగుంట, యాదవవీధి, సంగం రోడ్డు సెంటర్, రామనగర్‌గేటు సెంటరు, శ్రీహరికాలనీ, శింగయ్యచేను, అగచాట్లపురం, విఘ్నేశ్వరపురం కాలనీ, బాలాజీనగర్, మస్తాన్‌రెడ్డి నగర్, మారుతీనగర్, నరసారెడ్డికాలనీ, శివాలయం వీధి, సంగంరోడ్డు సెంటర్, నిమ్మమార్కెట్ యార్డు తదితర ప్రాంతాల్లో గణేశుని ప్రతిమలను ఏర్పాటు చేశారు. పుట్టాయగుంట వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ భక్తులను ఆకట్టుకుంది. గేటుసెంటర్‌లోని విఘ్నేశ్వరుడు భక్తులను ఆకర్షిస్తున్నారు. రామనగర్ గేటుసెంటర్‌లో పద్మావతినగర్, తొగటవీధి వీధుల్లో వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో రెండు నుంచి మూడు ప్రతిమలను ఏర్పాటు చేసి ఘనంగా చవితి వేడుకలను జరుపుకున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు.

• **ముత్తుకూరు :** వినాయక చవితి పర్వదిన వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. వివిధ ఆకారాలు, వాహనాలతో కూడిన వినాయకుడి విగ్రహాలను వీధి వీధిన ప్రతిష్ఠించి, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిపారు. పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

• **మనుబోలు :** మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో వినాయక ప్రతిమల వద్ద వివిధ రకాల పిండి వంటలు, పండ్లు ఉంచి పూజలు చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో 130కు పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో నెలకొల్పారు. మండల కేంద్రమైన మనుబోలులోనే 20పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. వాడవాడలా నెలకొల్పిన గణనాథుల విగ్రహాల వద్ద సందడి కొనసాగుతోంది. మరో వారం రోజుల పాటు నిమజ్జనాలు కొనసాగుతాయి.


విడవలూరు : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

• వినాయక చవితిని పురస్కరించుకుని పిడూరు రోడ్డులోని వినాయక మండపం వద్ద ఆదివారం సాయంత్రం చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

• **వెంకటాచలం :** మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన వెంకటాచలం, సర్వేపల్లి, తిక్కవరప్పాడు, కసుమూరు, కాకుటూరు, చెముడుగుంట, గొలగమూడి, అనికేపల్లి తదితర గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తిక్కవరప్పాడు గ్రామంలో ఉట్టి మహోత్సవం జరిగింది. అనంతరం వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట/కోవూరు :** వినాయక చవితి పర్వదినాన్ని మండల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మైపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్ :** నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో వినాయక చవితి వేడుకలు జరిగాయి. బుచ్చి పట్టణంలోని చాముండేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

• **కొడవలూరు :** మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరు, గండవరం, యల్లాయపాళెం, కమ్మపాళెం, రేగడిచెలిక తదితర గ్రామాల్లో వాడవాడలా వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. కొడవలూరులో పీర్ల చావడి యూత్, నార్తురాజుపాళెంలో సర్కారు తోపు యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొంటున్నాయి.

• **విడవలూరు :** మండలంలోని రామతీర్థం బీచ్ వద్ద గణనాథుల విగ్రహాల నిమజ్జనం ఆదివారం జరిగింది. ఎస్సై సాయిప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.


పొదలకూరు : పుట్టాయగుంటలో పుట్ట తరహా సెట్టింగ్‌లో గణపయ్య


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడ గ్రామంలో..


పొదలకూరు : పద్మావతినగర్‌లో..


కొడవలూరు : నార్తురాజుపాళెం దళితవాడలో..


మనుబోలు: పిడూరురోడ్డులోని గణనాథుడు


కొడవలూరు పీర్ల చావడి సెంటర్‌లో..


ముత్తుకూరు : బ్రహ్మదేవిలో..


ముత్తుకూరు : పంటపాళెంలో..


మనుబోలు: ఉట్టి కొడుతున్న చిన్నారులు


వెంకటాచలం : తిక్కవరప్పాడులో గ్రామోత్సవం

గాంధీ ఆశ్రమాన్ని సందర్శించడం సంతోషకరం


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి

• తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ఇందుకూరుపేట : జాతిపిత గాంధీ నడయాడిన ప్రదేశాన్ని సందర్శించడం సంతోషకరంగా ఉందని తెలంగాణ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం జరిగిన సర్వమత ప్రార్థనల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆశ్రమానికి చరిత్రలో గొప్ప స్థానం ఉందన్నారు. అనంతరం ఆయన్ను ఆశ్రమ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, సభ్యులు గంపల మంజుల, రాజేశ్వరి, రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలై చోరీలు

• ముగ్గురు నిందితుల అరెస్ట్

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెం వద్ద దాబాలో జరిగిన చోరీ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుధాకర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. నెల్లూరు రంగనాయకులపేటకు చెందిన షేక్ సుబహాన్, వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ సమద్, షేక్ అబ్దుల్ వహిద్ చెడు వ్యసనాలకు బానిసలై చోరీలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో మోటార్ సైకిళ్లను చోరీ చేసి పోతిరెడ్డిపాళెం వద్ద ఉన్న దాబాలో ఏసీ, ఫ్యాన్లు, మైక్రో ఒవెన్, ఇన్వర్టర్, బ్యాటరీ, సీసీ కెమెరాలు, వంటగది సామగ్రిని చోరీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నాలుగు బైక్‌లతో పాటు చోరీ చేసిన సామగ్రిని రికవరీ చేసినట్లు తెలియజేశారు. ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న సామగ్రి, నిందితులతో పోలీసులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం, వీర్లగుడిపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పొదలకూరుకు చెందిన ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య, మధు, పద్మమ్మ, శేషాద్రి పాల్గొన్నారు.

కృష్ణపట్నం సీఐగా రవినాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రవినాయక్

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.రవినాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన వెంకటరెడ్డి బదిలీపై నెల్లూరు సౌత్ ట్రాఫిక్ విభాగానికి వెళ్లిన విషయం తెలిసిందే.

కొడవలూరు ఎస్సైగా కోటిరెడ్డి


బాధ్యతలు స్వీకరించిన కోటిరెడ్డి

కొడవలూరు : కొడవలూరు ఎస్సైగా సీహెచ్.కోటిరెడ్డి ఆదివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన వింజమూరు ఎస్సైగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత


పోలీసుల అదుపులో మట్టి ట్రాక్టర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాలు.. సంగం మండలం నుంచి బుచ్చిరెడ్డిపాళెంలోని పలు ప్రాంతాలకు అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న సమాచారంతో బుచ్చి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు నిఘా ఉంచారు. శనివారం వేకువ జామున అనుమతుల్లేకుండా మట్టి లోడు చేసుకుని వస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు


ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు


బండ లాగుతున్న ఎడ్లు

• విజేతగా కోవూరు మండల ఎడ్లు

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలోని జానకి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. గమల్లపాళెం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో 10 జతల ఎడ్లు పాల్గొన్నాయి. కోవూరు మండలం పడుగుపాడుకు చెందిన హేమంత్‌రెడ్డి ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 4,882 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. బుచ్చి మండలం జొన్నవాడకు చెందిన అంకయ్య ఎడ్లు 4,862 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు దక్కించుకున్నాయి. బుచ్చి మండలం దామరమడుగుకు చెందిన దువ్వూరు శైలజారెడ్డి ఎడ్లు, అల్లూరు మండలం కృష్ణతేజారెడ్డి ఎడ్లు 4,500 అడుగుల దూరం లాగి మూడు, నాలుగు స్థానాలను గెలుచుకుని రూ.10 వేలు, రూ.7 వేలు దక్కించుకున్నాయి. కావలి మండలం చౌదరిపాళేనికి చెందిన గోవిందరెడ్డి ఎడ్లు 4,382 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో వచ్చి రూ.5 వేలు సాధించాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లకు ప్రోత్సాహక బహుమతిగా రూ.2 వేలు అందించారు. మొదటి బహుమతిని దండా బ్రదర్స్, రెండో బహుమతిని పులుగుంట మహేంద్రరెడ్డి, మూడో బహుమతిని పులుగుంట మహదేవరెడ్డి, నాలుగో బహుమతిని శివాలయం కమిటీ సభ్యులు, ఐదో బహుమతిని వాకా మాధవరెడ్డిలు సమకూర్చారు. అన్నదానం చేశారు. ఎస్సై లతీఫున్నీసా ఆదేశాల మేరకు ఏఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దివ్య బలిపూజ



తోటపల్లిగూడూరు : కోడూరు వేళాంగణి మాత(మరియమాత) చర్చిలో దివ్య బలిపూజను ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేళాంగణి చర్చి డైరెక్టర్ లూకాస్‌రాజ్ ఆధ్వర్యంలో ఆర్సీఎం మిషన్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం అమ్మవారికి సమష్టి దివ్య బలిపూజను అర్పించారు. అమ్మవారి జన్మదిన వేడుకల్లో అత్యంత కీలకమైన ఘట్టానికి రాష్ట్ర నలువైపుల నుంచి భక్తుల విచ్చేసి తిలకించారు. అనంతరం డాక్టర్ ఎండీ ప్రకాశం భక్తులకు దైవ సందేశాన్ని ఇచ్చారు.